క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం: విద్యుత్‌లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం చింతపట్ల ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉపాధిహామీ సామాజిక తనిఖీ

తలకొండపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు ఉపాధిహామీ సామాజిక తనిఖీ బహిరంగ ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

ఎమ్మెల్యే పరామర్శ



యాదవ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: మార్కెట్ వైస్ చైర్మన్ తోట గిరి యాదవ్‌ను మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. అనారోగ్యంతో కందుకూరులోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న తోటను మంగళవారం ఎమ్మెల్యే పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్, వైస్ చైర్మన్ సత్యం, నాయకులు వీరయ్య, శ్రీనునాయక్, కృష్ణ తదితరులు ఉన్నారు.

వార్డు అభివృద్ధికి కృషి



కౌన్సిలర్ కవితను సన్మానిస్తున్న కాలనీ వాసులు

తుర్కయంజాల్: వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని పురపాలక సంఘం పరిధి కమ్మగూడ 19వ వార్డు కౌన్సిలర్ నారని కవిత చెప్పారు. మంగళవారం ఏపీఎటీ కాలనీలో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు కౌన్సిలర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ గౌడ్, గౌని వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అరవింద్

ఆమనగల్లు: నాలుగు రోజులుగా ఆమనగల్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు సాయిరాం మెడికల్‌హాల్ యజమాని పాపిశెట్టి అరవింద్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణనాయక్, గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, కోశాధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: తహసీల్దార్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించిన సంఘటన మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నగరానికి చెందిన మద్దెల రమేష్‌బాబు అనే వ్యక్తి రెవెన్యూ సంబంధిత పనుల కోసం వచ్చారు. తహసీల్దార్ అనితా రెడ్డి విధులకు ఆటంకం కలిగించారు. దీంతో తహసీల్దార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బంజారా భాషాభివృద్ధికి కృషి

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలో నివాసం ఉండే నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలం గౌరికుంట తండాకు చెందిన రమావత్ రాముకు పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ నుంచి ఎంఫిల్ పట్టా పొందారు. బంజారా భాషాక్రమాలు, వ్యాకరణ అధ్యయనం, భాష శాస్త్ర పరిశీలన అనే అంశంపై ప్రొఫెసర్ వై. రెడ్డి శ్యామల పర్యవేక్షణలో ఎంఫిల్ పూర్తి చేసినట్లు రమావత్ తెలిపారు. బంజారా భాష అభివృద్ధితో పాటు, లిపి కొరకు కృషి చేయడమే తన లక్ష్యమని రాము చెప్పారు.

ఆర్టీసీ డ్రైవర్ల దూకుడు!

నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై ఆర్టీసీ డ్రైవర్ల దూకుడుకు ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. వారి నిర్లక్ష్య డ్రైవింగ్ ఎప్పుడు ఎవరి ప్రాణాలను హరిస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. అందులో మార్పేమీ రానట్లు జరుగుతున్న రోడ్డు ప్రమాదాలే సాక్ష్యమని పరిసర ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

- వాయువేగంతో దూసుకెళ్తున్న బస్సులు
- ఆందోళన చెందుతున్న ప్రయాణికులు
- భయాందోళనకు గురవుతున్న వాహనదారులు
- ప్రశ్నిస్తే ప్రయాణికులపై డ్రైవర్ల తిరుగుబాటు
- ఫిర్యాదు చేసినా ఫలితం లేదంటున్న ప్రజలు



సాగర్‌రోడ్డుపై కొద్దిరోజుల క్రితం బస్సు నిలిపి ఆందోళన చేస్తున్న ప్రయాణికులు

యాచారం: నల్లగొండ జిల్లా దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు సాగర్‌రోడ్డుపై దేవరకొండ–హైదరాబాద్‌కు సాగర్ రహదారిపై నిత్యం 50 సర్వీసుల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. వాటి పరుగులే ప్రజల ప్రాణాల మీదకు తెస్తోందని ప్రత్యక్ష సాక్షులు స్పష్టం చేస్తున్నారు. అందుకు కారణం ఆ డిపోకు చెందిన డ్రైవర్లే అని, వారి దూకుడుపై సంస్థ అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. వారి తీరుపై గతంలో పలుమార్లు ప్రయాణికులు సాగర్‌రోడ్డుపై మాల్, యాచారం, గునుగల్, ఆగాపల్లి, ఇబ్రహీంపట్నం తదితర కేంద్రాల్లో ధర్నాలు, రాస్తారోకోలు చేశారు.

ప్రమాదాలకు నెలవు..

డీవీకే ఆర్టీసీ డిపో సర్వీసులతో సాగర్‌రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. నిత్యం ఏదో ఒక చోట ఎదురుగా వచ్చే వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు నెలల వ్యవధిలో 20కి పైగా యాక్సిడెంట్లు జరిగినట్లు సమాచారం. దీనిపై డ్రైవర్లను పలువురు బాధితులు ప్రశ్నించగా.. 'మేము గిట్లనే బస్సులను నడుపుతం. ఎదురుగా వస్తుంటే మీరే జాగ్రత్తగా రావాలి' అని దురుసు సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. రెండు రోజుల కిందట యాచారం మండల కేంద్రంలో ఉదయం 7 గంటలకు ప్రయాణికుడు చేయి ఎత్తినా బస్సును నిలపకపోగా.. బాటసారుల మీదకే బస్సును తీసుకెళ్లి భయపెట్టినట్లు పలువురు పేర్కొన్నారు. తాజాగా మంగళవారం సాగర్‌రోడ్డుపై దేవరకొండ ఆర్టీసీ బస్సు ఢీ కొట్టడంతో ఓ ప్రయాణికుడు అక్కడికక్కడే మృతి చెందాడు.

మండల కేంద్రమైనా..

దేవరకొండ నుంచి సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రం ఉంది. అయినా అక్కడ డీవీకే బస్సులు నిలపడం లేదు. ఇదే విషయమై పలుమార్లు ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసినా.. ఆర్టీసీ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ అశోక్‌రాజును సంప్రదించగా.. 'సాగర్‌రోడ్డుపై దేవరకొండ ఆర్టీసీ బస్సులు వేగంగా వెళ్తున్నట్లు ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందాయి. తాజాగా గురునానక్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద బస్సు ఢీకొని ఓ ప్రయాణికుడు మృత్యువాత పడ్డాడు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా' అని ఆయన చెప్పారు.

ఆపినా ఆగవు..



యాచారం మండల కేంద్రం నుంచి తరచూ నగరానికి బస్సుల్లోనే వెళ్లి వస్తుంటాము. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే దేవరకొండ బస్సులు.. చేయి ఎత్తినా ఆగవు. ఒక్కోసారి వాటి వేగం మమ్మల్ని భయాందోళనకు గురిచేస్తుంది. పలుమార్లు సంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాం. అయినా స్పందన లేదు.

– వెంకటరెడ్డి, ప్రయాణికుడు, యాచారం

అతి వేగంగా..



సాగర్‌రోడ్డుపై దేవరకొండ బస్సులు వాయువేగంతో దూసుకెళ్తుంటాయి. ఎదురుగా వస్తున్న వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాహనం నడపాల్సి ఉంటుంది. నిత్యం బీఎన్‌రెడ్డి నగర్‌కు కారులో వెళ్లి వస్తుంటాను. పలుమార్లు కళ్లెదుటే ప్రమాదాలు జరిగాయి.

– జుట్టు శ్రీశైలం, చౌదర్‌పల్లి

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

మంచాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకొని అభ్యున్నతి పొందాలని మంచాల పశు వైద్యాధికారి సుధారెడ్డి చెప్పారు. మంగళవారం జన జాగృతి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ప్రభుత్వం నాబార్డు సహకారంతో రైతులకు అందజేస్తున్న సేవలను గుర్తు చేశారు. రైతులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాలు ఇస్తున్నారని, పట్టణ ప్రాంతంలో 10 శాతం, గ్రామీణ ప్రాంతంలో 35 శాతం రాయితీపై పలు రకాల రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంస్థ చైర్మన్ రాజేందర్ రెడ్డి, గ్రామ కో–ఆప్షన్ సభ్యుడు బాలరాజ్, డైరెక్టర్లు శ్రీశైలం, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ సరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

6న సర్వసభ్య సమావేశం

తలకొండపల్లి: ఈ నెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ నిర్మల మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరగనున్న సమావేశానికి వివిధ శాఖల మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

పరిపూర్ణ ఆరోగ్యానికి సంపూర్ణ ఆహారం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

తలకొండపల్లి: పరిపూర్ణ ఆరోగ్యానికి సంపూర్ణ ఆహారం ముఖ్యమని, ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యాన్ని నిర్దేశిస్తాయని సర్పంచ్ వెంకట్రాంరెడ్డి అన్నారు. ఖానాపూర్‌లో మంగళవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్, జెడ్పీటీసీ వెంకటేశ్, హైదరాబాద్ కామినేని ఆస్పత్రి యాజమాన్యం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించి మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని, ప్రజలందరూ వీటిని సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవినాయక్, వార్డు సభ్యులు మల్లమ్మ, లక్ష్మీదేవి, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్యగౌడ్, శివాజి, శ్రీను, సంపత్, కరుణాకర్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, బుచ్చిబాబు, వైద్యులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో సీసీల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్

- ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానం
- ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్

కడ్తాల్: నేర రహిత సమాజ నిర్మాణంలో సీసీ కెమెరాలు కీలకంగా పనిచేస్తాయని, వాటి ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం జీపీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అధ్యక్షతన సీసీల ఏర్పాటుపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతో పాటు, జాతీయ రహదారిపై కెమెరాలు అమర్చేందుకు ప్రత్యేక దృష్టి సారించామని, వాటి ఏర్పాటుకు స్థానికులు, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయడంతో పాటు, దొంగతనాలు నివారించడానికి దోహదపడతాయని చెప్పారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు సమాచార సేకరణకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒక్క కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, అందుకే సీసీల ప్రాధాన్యత గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీవో మధుసూదనాచారి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉప సర్పంచ్ రామకృష్ణ, వర్తక సంఘం అధ్యక్షుడు ఆసిఫ్‌అలీ, సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకటేశ్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, జహంగీర్‌అలీ, మహేశ్, చంద్రయ్య, రాజేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయం లేకుండా అనుమతులా?

బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి
మైనింగ్ పనులు ఆపాలంటూ డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: మున్సిపల్ పరిధిలోని సాకిబండ తండా సమీపంలో ఏర్పాటు చేసిన మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయాలని బీసీ కమిషన్ జాతీయ మాజీ సభ్యుడు ఆచారి డిమాండ్ చేశారు. గిరిజన యువకులపై పోలీసులు నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు. మైనింగ్ పనులు ఆపేయాలంటూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచారి మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయం సేకరించకుండా ఏకపక్షంగా మైనింగ్‌కు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. మైనింగ్‌తో పచ్చని పొలాలు దెబ్బతింటున్నాయని, తండాలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని తెలిపారు. మైనింగ్ పనులకు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అండ ఉందని ఆరోపించారు. వెంటనే మైనింగ్‌ను నిలిపివేయాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు కే హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కల్వకుర్తి కో కన్వీనర్ నర్సింహ, నాయకులు చెన్నకేశవులు, కృష్ణ యాదవ్, రాంరెడ్డి, పత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆటపాటల్లో ముందుండాలి



శిబిరంలో మాట్లాడుతున్న పాపిశెట్టి రాము

ఆమనగల్లు: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోనూ ముందుండాలని ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము అన్నారు. మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో శృతిలయ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. విద్యార్థులు జీవన నైపుణ్యాలతో పాటు నైతిక విలువల ప్రాధాన్యత గురించి తెలుసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు నిర్వహించే శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందులో వివిధ పాత్ర్యాంశాలతో పాటు నృత్యాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, యోగాసాధన చేయిస్తామని వివరించారు. కార్యక్రమంలో శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, సలహాదారులు తిరుపతిగౌడ్, విష్ణు, మహేశ్, జంగయ్య, ఆంజనేయులు, శిబిరం ఇన్‌చార్జిలు రవీందర్, సునీత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

9న యువ సమ్మేళనం

ఇబ్రహీంపట్నం: యువతకు అండగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఉంటారని బీఆర్ఎస్‌వై నియోజకవర్గ అధ్యక్షుడు రాజు అన్నారు. మున్సిపాలిటీలోని 8,9,11,12,13 వార్డుల్లో యువజన, విద్యార్థి విభాగాల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత్‌రెడ్డి నేతృత్వంలో 9వ తేదీన యువ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాదగిరి, వెంకట్‌రెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, శివసాయి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

కడ్తాల్: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కడ్తాల్ గ్రామానికి చెందిన జంగయ్యకు రూ.15 వేలు, మైసిగండికి చెందిన దేవేందర్‌కు రూ.20 వేలు, మక్తామాధారం సాయిలుకు రూ.24 వేలు, సాలార్‌పూర్ మహేశ్వరికి రూ.18 వేలు, చల్లంపల్లికి చెందిన అంజయ్యకు రూ.42 వేలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాం, కృష్ణయ్య, ఎంపీటీసీలు మంజుల, ప్రియ, మార్కెట్ డైరెక్టర్ నర్సింహగౌడ్ ఉన్నారు.

ఆర్థిక సాయం

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మాసనోళ్ల మణెమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి ఆమెను పరామర్శించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, వార్డు సభ్యులు, నాయకులు మల్లయ్య, శ్రీను, భిక్షపతి పాల్గొన్నారు.

మైసిగండి ఆలయానికి పెరిగిన ఆదాయం

- దుకాణ సముదాయాల వేలంలో రూ.15.11లక్షలు పలికిన పూజా సామగ్రి విక్రయహక్కు



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కడ్తాల్: మైసిగండిలో కొలువుదీరిన మైసమ్మ ఆలయానికి గతేడాది కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. 2023–24 సంవత్సరానికి ఆలయ పరిసరాల్లో పూజా సామగ్రి విక్రయానికి, తదితర దుకాణ సముదాయాలకు మంగళవారం ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, పర్యవేక్షణ అధికారి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ముగ్గురు వ్యాపారులు పాల్గొన్నారు. మాధారం గణేశ్‌గౌడ్ రూ.15.11 లక్షలకు పూలు, పూజ సామగ్రి విక్రయాల హక్కును దక్కించుకున్నాడు. అదే విధంగా శాశ్వేయ మొక్కుబడులు రసీదు రుసుం వసూలు చేసుకునే హక్కును, పొందేందుకు 12 మంది పాటలో పాల్గొనగా.. గడిచిన ఏడాదికంటే తక్కువగా పలకడంతో వేలాన్ని వాయిదా వేశారు. గతేడాది పూలు పూజ సామాగ్రి విక్రయ హక్కు రూ.12.60లక్షలు పలకగా, ఈ ఏడాది రూ.15.11 లక్షలు పలికి, ఆలయానికి అదనంగా రూ.2.51ల ఆదాయం సమకూరింది. కార్యక్రమంలో రామవత్ భాస్కర్‌నాయక్, శ్రీరాములు, అరుణ్‌కుమార్, అమ్ము, పాండు, ఆలయ అర్చక సిబ్బంది కృష్ణ, బోడ్యా, చంద్రయ్య, రమాదేవి, శ్రీనివాసులు, కృష్ణయ్య, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల భవనానికి నిధులు మంజూరు



అసంపూర్తిగా నిలిచిన కళాశాల భవనం

- రెండు నెలల్లో పూర్తికానున్న నిర్మాణ పనులు
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: అసంపూర్తిగా నిలిచిపోయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులకు అదనంగా రూ.43 లక్షల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. వినోబానగర్‌లో రూ.2.50 కోట్ల వ్యయంతో చేపట్టిన డిగ్రీ కళాశాల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చించి అదనపు నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుందన్నారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభం అవుతాయని, రెండు నెలల్లో భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచే నూతన భవనం అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యేతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: కుత్బుల్లాపూర్ గ్రామంలో మంగళవారం సుప్రజ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, సర్పంచ్ ముద్దం స్వరూప ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ విజయ్‌కుమార్, ఎంపీటీసీ భాస్కర్ గౌడ్, సీనియర్ నాయకులు బాలరాజ్, బ్రహ్మాచారీ తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న క్యామ మల్లేశ్ తదితరులు

జేపీఎస్‌లను క్రమబద్ధీకరించాలి

- ఉద్యోగ భద్రత లేక ఇబ్బంది పడుతున్న కార్యదర్శులు
- ఎంపీపీ తిర్మణీ నిర్మల

తలకొండపల్లి: ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని ఎంపీపీ తిర్మణీ నిర్మల డిమాండ్ చేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె మంగళవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆమె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపి మాట్లాడారు. జేపీఎస్‌ల నియామకం జరిగి నాలుగేళ్లు పూర్తయినా.. ఇంతవరకు ప్రభుత్వం ఎందుకు రెగ్యులరైజ్ చేయలేదని ఆమె ప్రశ్నించారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. ఇందుకోసం ఈ నెల 6న జరగనున్న మండల సర్వసభ్య సమావేశంలో జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎంపీపీ చెప్పారు. కార్యక్రమంలో శ్రీశైలంగౌడ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతి..

ఇబ్రహీంపట్నం: సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేయాలని జేపీఎస్‌లు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసేందుకు ఒప్పించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం

యాచారం: మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు మంగళవారం ఎంపీపీ కొప్పు సుకన్య సంఘీభావం తెలిపారు. జేపీఎస్‌లు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలంటూ నిరసన చేపట్టారని, ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఇబ్రహీంపట్నం: ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న జేపీఎస్‌లు



తలకొండపల్లి: జేపీఎస్‌ల సమ్మెలో కూర్చున్న ఎంపీపీ నిర్మల తదితరులు



యాచారం: జేపీఎస్‌ల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ఎంపీపీ సుకన్య